APTEL/2023/88044
తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ
సంపుటి : 01 | సంచిక : 242 | ఎడిటర్ : ఎం. రమేష్ | సోమవారం, ఆగస్టు 12, 2024 | పేజీలు : 04 | వెల రూ. 5.00/-

## కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటు

**రబీకి నీళ్లు కష్టమేనన్న కర్ణాటక డిప్యూటీ సీఎం**
**ఆదివారం కొట్టుకుపోయిన గేటును పరిశీలించిన డీకే శివకుమార్**
**డ్యామ్ గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఖరీఫ్‌కు మాత్రమే నీరు అందిస్తామన్న శివకుమార్**
**రబీకి నీరు అందించడం కష్టం కాబట్టి రైతులు సహకరించాలని విజ్ఞప్తి**

తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో... ఈ ఏడాది ఖరీఫ్ పంటకు నీరు అందేలా చూస్తామని, రబీ పంటకు మాత్రం నీరు అందించడం కష్టమేనని... కాబట్టి రైతులు సహకరించాలని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోవడంతో ఆయన ఆదివారం డ్యాంను పరిశీలించారు. గేటు ధ్వంసం కావడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్యాంకు గేటును బిగించే అంశంపై మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తుంగభద్ర డ్యామ్ 19వ గేటు ధ్వంసం కావడం బాధకరమన్నారు. ఈ డ్యామ్ కర్నాటక- ఆంధ్రప్రదేశ్- తెలంగాణ మూడు రాష్ట్రాలకు వరప్రదాయిని అన్నారు. ఈ డ్యామ్‌లో 40 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. మిగతా నీటిని దిగువకు విడుదల చేస్తే గేటు



మరమ్మతులకు అవకాశం ఉంటుందన్నారు. వీలైనంత త్వరగా గేటును పునరుద్ధరిస్తామన్నారు. కాగా, గేటు మరమ్మతుల కోసం నీటిని కిందకు వదులుతున్నారు. మరో ఏడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు.

## ఫోన్ హ్యాక్ అయింది... నాకు ఎవరూ ఫోన్ చేయకండి: సుప్రియాసూలే



తన ఫోన్, వాట్సాప్ హ్యాక్ అయ్యాయని, కాబట్టి ఎవరూ తనకు ఫోన్ చేయవద్దని ఎన్సీపీ (శరద్ పవార్) ఎంపీ సుప్రియా సూలే ఆదివారం సూచించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'ముఖ్యగమనిక: నా ఫోన్, వాట్సాప్ హ్యాక్ అయ్యాయి. దయచేసి నాకు ఎవరూ కాల్ చేయవద్దు. మెసేజ్ చేయవద్దు. ఇందుకు సంబంధించి తాను పోలీసులకు ఫిర్యాదు చేశాను' అని ట్వీట్ చేశారు. ఫోన్, వాట్సాప్ హ్యాక్ కావడంతో ఆమె ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు సుప్రియా సూలే సన్నిహితులు చెబుతున్నారు. సుప్రియా సూలే మహారాష్ట్రలోని బారామతి నుంచి ఎంపీగా ఉన్నారు. శరద్ పవార్ కూతురు. ప్రస్తుతం ఎన్సీపీ (శరద్ పవార్) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు.



## నిప్పు అంటుకుందనుకుని.. రైల్లోంచి దూకేసిన ప్రయాణికులు

**రైల్లో అగ్నిమాపక పరికరాన్ని వాడిన ఆకతాయిలు**
**ఆ పొగలను చూసి అగ్నిప్రమాదం జరిగి ఉంటుందనే ఆందోళన**
**భయంతో కదులుతున్న రైల్లోంచి దూకేసిన కొందరు**

కొందరు ఆకతాయిలు చేసిన పనితో రైలుకు నిప్పు అంటుకుని ఉంటుందని భయపడి కొందరు ప్రయాణికులు కదులుతున్న రైలులోంచి కిందికి దూకేశారు. అందులో 12 మందికి గాయాలయ్యాయి. ఉత్తరప్రదేశ్ లోని బిల్ పూర్ సమీపంలో ఈ సంఘటన జరిగింది. హావ్‌డా- అమృత్‌సర్ ఎక్స్‌ప్రెస్ రైలు బిల్ పూర్ స్టేషన్‌కు చేరుకుంటున్న సమయంలో.. కొందరు ఆకతాయిలు అగ్నిమాపక పరికరాన్ని తీసి స్ప్రే చేశారు. దాంతో పొగలు రావడంతో.. రైలులో మంటలు చెలరేగి ఉంటాయనే ఆందోళన మొదలైంది. కొందరు ప్రయాణికులు భయంతో అత్యవసర బ్రేక్ చైన్ లాగారు. కానీ రైలు ఆగేలోపే భయంతో కొందరు ప్రయాణికులు కిందికి దూకేశారు. రైలు లోంచి కిందికి దూకినవారిలో 12 మందికి గాయాలైనట్టు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. నిజానికి అప్పటికే రైలు వేగం బాగా తగ్గిందని.. లేకుంటే క్షతగాత్రుల సంఖ్య పెరిగి ఉండేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

## కర్ణాటకలో.. ఏపీఎస్ఆర్టీసీ బస్సు బోల్తా

**బాగేపల్లి మండలం చుండూరు వద్ద ప్రమాదం**
**బస్సు బెంగళూరు నుంచి పుట్టపర్తి వస్తుండగా ప్రమాదం**
**గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలింపు**

కర్ణాటకలో ఏపీఎస్ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. బాగేపల్లి మండలం చుండూరు వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ బస్సు బెంగళూరు నుంచి పుట్టపర్తి వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు.



## విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

పీపుల్స్ మోటివేషన్ తెలుగు దినపత్రికలో

నియోజకవర్గ ఇంచార్జ్‌లు
మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 80086 22746

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

## బడ్జెట్ సమావేశాలు ముగించారు !

కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి వచ్చి ఏడాది కావస్తోంది. కొత్త భవనంలో పాత విధానాలతోనే కార్యక్రమాలు సాగుతున్నాయి. సరైన చర్చలకు ఆస్కారం కలగడం లేదు. బడ్జెట్ సమావేశాలు కూడా యథాలాపంగా సాగాయి. పెద్దగా చర్చలు సాగలేదు. బడ్జెట్ క్రతువును ముగించేలా నిర్ణయాలు జరిగాయి. మమ అనిపించి పార్లమెంట్ సమావేశాలు ముగించారు. ఎప్పుడూ నాలుగైదు రోజులు ముందే సమావేశాలు ముగుస్తున్నాయి. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలు వారికి కానరావడం లేదు. బంగ్లాదేశ్‌లో ఊచకోతలపైనా చర్చించలేదు. కనీసం చర్చించివుంటే..ప్రపంచం దృష్టికి దాష్టీకాలను తీసుకుని వచ్చే అవకాశం ఉండేది. ఇకపోతే ప్రధాన సమస్యలపైనా చర్చ చేయలేదు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఎప్పటిలాగే తిరస్కరించారు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక చరిత్ర సృష్టించే నిర్ణయాలు తీసుకుంటుందని ఆశించారు. కానీ అలాంటి దేమీ కనిపించలేదు. జిఎస్టీపై ప్రశ్నలు లేవనెత్తితే ..అది ప్రజల సమస్యగా భావించి చర్చించాల్సిన ప్రభుత్వం విపక్షాలను ఎండగట్టేలా సమాధనం చెప్పిన తీరు జాతి మరువదు. మూడోదఫాలో మరింత సమర్థంగా,మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్న మోడీ వచనాలు ఎక్కడా ప్రతిఫలించలేదు. దేశంలో అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు సాగుతున్నాయన్న నమ్మకం కలిగించలేకపోయారు. ప్రజల సమస్యలను విస్తృతంగా చర్చించాలి. ఇందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వడం ద్వారా సమస్యలప చర్చ జరిపి ఉంటే బాగుండేది. విపక్షాలు కూడా ఉపన్యాసాలకు, రాజకీయ వ్యాఖ్యలకు అలవాటు పడ్డారు. అందువల్ల సమస్యలను గుర్తించ చర్చించాలన్న ఆలోచన లేకుండా సాగుతున్నారు. ఇకపోతే దేశహితం కోసం మరిన్ని కఠిన చట్టాలను రూపొందించాలి. చర్చల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి. ఎన్నికల్లో అక్రమాలు నిరోధించేలా నిర్ణయాలు రావాలి. అయితే బడ్జెట్ సమావేశాల్లో మరిన్ని నిర్ణయాల కోసం ప్రజలు ఎదురు చూసినా ఫలితం దక్కలేదు. తిరంగా యాత్రను ప్రారంభించారు. ప్రజల్లో దేశభక్తి లేక కాదు. ప్రజల్లో ఉన్నంతగా నేతల్లోనూ భక్తి రావాలి. ప్రజల జీవన ప్రమాణాలు పడిపోకుండా చూడాలి. వారు అప్పుల్లో కూరుకుపోకుండా బతికేలా నిర్ణయాలు ఉండాలి. కానీ అలాంటి ప్రయత్నాలు కానరావడం లేదు. అలాగే పార్లమెంట్ సీట్ల సంఖ్యను పెంచడం... గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం కూడా అత్యవశ్యకమే. గవర్నర్ వ్యవస్థ ఈ మధ్యకాలంలో రాజకీయాంగా దుమారం రేపుతోంది. అలాగే ఖాజానాపైనా భారీగా భారం పడుతోంది. గవర్నర్ వ్యవస్థలేని రాజ్యాలను నడుపుకోవాల్సి ఉంది. అలాగే ఎప్పుడో 50 ఏళ్ల క్రితం ఉన్న జనాభాకు అనుగుణంగా పార్లమెంట్ సీట్లు ఉన్నాయి. 542 సీట్లతోనే కొనసాగిస్తున్నాం. ఈ క్రమంలో లోక్‌సభ, రాజ్యసభలతో పాటు, అసెంబ్లీల్లో సీట్ల సంఖ్య పెరగాల్సి ఉంది. వాటిని ప్రస్తుత జనాభాకు అనుగుణంగా పెంచుకోవాల్సిందే. కనీసం వేయి సీట్లు ఉంటేనే ఇప్పుడున్న జనాభాకు తగిన ప్రాతినిధ్యం దక్కదు.140కోట్లు ఉన్న జనాభాకు అనగుణంగా పార్లమెంట్ సీట్లను పెంచుకోవాలి. అలాగే దేశానికి అనవసర వ్యవస్థగా ఉన్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి. పంచాయితీల్లో ఎంపిటిసిలు,జడ్పీటీసిల వ్యవస్థను ఎత్తేయాలి. పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను దేశ, రాష్ట్రాల జనాభాకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ జరగాలి. ఒకేదేశం, ఒకే చట్టం కోసం కసరత్తు జరుగుతున్న వేళ ఇలాంటి కీలక నిర్ణయాలు కూడా జరగాలి. ఇలాంటి అంశాలపై పార్లమెంటులో చర్చించివుంటే బాగుండేది. ఇకపోతే ఎపిలో కాకినాడను ఆనుకుని ఉన్న యానాంను పాండిచ్చేరిలో కాకుండా ఎపిలో విలీనం చేయడమే మంచిది. దీంతో ప్రజలకు కూడా పాలనా కేంద్రం దగ్గర కాగలదు. దీనిపై పాలకులు ఎందుకనో డిమాండ్ చేయడం లేదు. ఇలాంటి అసమానతలను చర్చిస్తే మంచిది. ఇందుకోసం పార్లమెంటులో చర్చించాలి. వ్యవస్థల ద్వారా మేలు జరగాలి. ఉపయోగం కలగాలి. అంతేకానీ గుదిబండగా మారరాదు. అలాగే ఆర్థిక భారంగా కూడా మారరాదు. దేశంలో ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పటిష్టమైన ఎన్నికల విధానం కూడా అవసరం ఉంది. ఇవన్నీ చర్చించడం ద్వారా నవ భారతానికి శ్రీకారం చుట్టాలి. స్వాతంత్ర్యోత్సవాలు జరుపుకుంటున్న వేళ ఇవన్నీ చర్చిస్తే మంచిది. అలాగే మహిళల ప్రాతనిధ్యం పెంచే మహిళా బిల్లును కూడా ఆమోదింప చేయడం, కోల్డ్‌స్టోరేజీకి పంపడం జరిగింది. మొన్నటి ఎన్నికల నుంచే దీనిని అమలు చేసివుంటే మహిళలకు న్యాయం జరిగివుండేది. 370 ఆర్టికల్‌ను రద్ద చేయడం లాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న మోడీ ప్రభుత్వానికి ఈ నిర్ణయాలు ఏమంత పెద్దవి కాక పోవచ్చు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఆదర్శ రాజకీయాలకు శ్రీకారం చుట్టాలి. ఇకపోతే పార్లమెంట్ వర్షకాల సమావేశాలు శుక్రవారంతోముగిశాయి. లోక్ సభ వాయిదా పడిన వెంటనే స్పీకర్ ఓం బిర్లా తేనిటి విందు ఇచ్చారు. టీ పార్టీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ సా, కిరణ్ రిజిజు, రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, ఎంపీలు సుదీప్ బందోపాధ్యాయ, కనిమోళి తదితరులు హాజరయ్యారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. స్పీకర్ తేనిటి విందుకు హాజరైన ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎప్పుడూ ఉప్పు, నిప్పుగా ఉండే వీరు కలిసి ఫొటోలకు ఫోజిచ్చారు. వాస్తవానికి లోక్ సభ ఆగస్ట్ 12వ తేదీన వాయిదా పడాలి. సభా వ్యవహారాలు పూర్తయినందున సమావేశాలు ముగించామని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈసారి సభకు ఎక్కువ మంది సభ్యులు హాజరయ్యారని వివరించారు. సమావేశంలో బడ్జెట్ బిల్లుకు ఆమోదం లభించింది. జమ్ముకశ్మీర్ విభజన బిల్లు, ఇండియన్ ఎయిర్ క్రాఫ్ట్ బిల్లులకు కూడా సభ ఆమోదం లభించింది. వక్ఫ్ బిల్లుపై జెపిసిని వేశారు. ఇంతకు మించి ఈ సమావేశాల్లో పెద్దగా ప్రయోజనం చేకూర్చే అంశాలు లేవు.

## భవిష్యత్ ప్రణాళిక అవశ్యం !

తిరుమల,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): జీవితంలో ప్రణాళిక అవసరం. ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని విభజించుకుని సాగాలి. ఈ క్రమంలో భవిష్యత్తు గురించి ముందుగా ప్రణాళికలు వేసుకుని పనిచేసే సామర్థ్యం చాలా మందికి ఉండదు. ఎందుకంటే మనం వర్తమానానికి బందీలం. పక్కనేఉన్న ప్రమాదాలను, సంతోషాలను అధిగమించి పనిచెయ్యడం ఒక గొప్ప శక్తి. వెనక్కి తగ్గే స్వభావాన్ని విడిచిపెట్టాలి. కళ్లకు కనిపించే దానికన్నా భవిష్యత్తులో గొప్పవి జరగబోతున్నాయని ఊహించడం నేర్చుకోవాలి.సాధారణంగా మనం తప్పులు చెయ్యడానికి కారణం- మన దగ్గరగా ఉన్న ప్రమాదాలకు భయపడటం, దూరంగాఉన్న ప్రమాదాలను పట్టించుకోకపోవడం! వాటినిగాని మనం ముందుగా ఊహించి అంచనా వెయ్యగలిగితే చాలా పొరపాట్లు నివారించవచ్చు. ఒకవేళ అనుకోని ప్రమాదం ఏదైనా ఎదురైతే, దాన్ని తెలివిగా మనకు అనుకూలంగా మార్చుకోవాలి. ఆంజనేయుడి తోకకు రావణాసురుడు నిప్పు పెట్టాడు. లంకలో రాక్షసులంతా తెగ ఆనందపడిపోయారు, హనుమంతుడు కాలి బూడిదైపోతాడని. అలా జరగలేదు. లంకనే తన తోకతో తగలబెట్టాడు హనుమంతుడు. ప్రమాదాన్ని తనకు అవకాశంగా ఉపయోగించుకుని చరిత్రలో ఒక గొప్ప రసవత్తరమైన ఘట్టంగా మలిచాడు ఆయన.

# వ్యవసాయాన్ని పరిశ్రమగా అభివృద్ధి చేయాలి

**పంటల విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టాలి**
**సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా నిర్ణయాలు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ):**

రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలని సూచించారు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణమాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. సస్య విప్లవానికి నాంది పలకాలి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమం గానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. వ్యవసాయరంగంలో విప్లవాత్మకనిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం వచ్చింది. పంటల ఎగుమతులు లక్ష్యంగా వ్యవసాయం మారాలి. సేంద్రియం వైపు సాగు మళ్లకుంటే ప్రజలు మరింతగా అనారోగ్యం పాలు కాగలరని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు మారాల్సి ఉంది. స్వాతంత్ర్యం లభించి 76సంవత్సరాలు పూర్తయినా ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్నప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమిా సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. మనరైతులనే ప్రోత్సహించి పంటల దిగుబడి పెంచుకోవాలి. పెరిగిన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేలా విధానాలు రూపొందించాలి. రైతులను కాపడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. కరువులు వచ్చినా, వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక, అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకే సరిపోతుంది. ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమానులకు చెల్లించవలసి వస్తుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం మంచిగా అయినప్పటికీ ధరలు రాక నష్టపోతు న్నారు. వర్షాలు లేని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభి స్తూనే ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. చాలామంది రైతులు, కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నారు, వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుంటే తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుంటు న్నారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచాలి.


# ఆశ్రమ పాఠశాలలకు సన్నబియ్యం

**అక్రమాలు నిరోధించేలా చర్యలు**

**నిజామాబాద్,ఆగస్ట్11(ఆర్ఎన్ఎ):**

రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించడంలో భాగంగా సన్నబియ్యం సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ బియ్యం దారిమళ్లుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో పౌరసరఫరాల శాఖ సన్నబియ్యం వినియోగంలో అక్రమాలను అరికట్టేందుకు నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఆయా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లేదా,వార్డెన్, డిప్యూటీ వార్డెన్లు బియ్యం సరఫరా అవుతున్న ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద వేలిముద్ర వేస్తేనే సన్నబియ్యం విడుదలయ్యేలా నేషనల్ ఇన్‌ఫర్‌మేటిక్ సెంటర్ వెబ్‌సైట్ అభివృద్ధి చేసింది. వేలాదిమంది విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. వారి వివరాలు సంబంధిత ఉపాధ్యాయులు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్నారు. ఆగస్టు నుంచి నూతన విధానం సైతం అమలులోకి వచ్చినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని ఆశ్రమ పాఠశాలలు ఆన్‌లైన్ విధానం ద్వారా సన్నబియ్యం తీసుకెళ్తున్నారు. జిల్లాలో ఆశ్రమ పాఠశాలలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటేనే సన్నబియ్యం అందుతాయి. ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ఈ-పాస్ యంత్రాలను ఉపయోగించి కార్డుదారుల వేలిముద్రలు వేసిన తర్వాతే బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇదే విధానాన్ని ఆశ్రమ పాఠశాలలకు వర్తింపజేస్తున్నారు. ఆయా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లేదా వార్డెన్, డిప్యూటీ వార్డెన్లు వారి వేలిముద్రలను ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద పెడితేనే బియ్యం సరఫరా చేయనున్నారు. నెలలో ఎంతబియ్యం పాఠశాలకు కేటాయించాలనేది ఆన్‌లైన్‌లోనే లెక్క తేలుతుంది. అటోమెటిక్‌గా ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, నిల్వ ఉన్న బియ్యం ఆధారంగా మరుసటి నెలకు కావాల్సిన బియ్యం కేటాయింపులు ఖరారు అవుతుంది. ఆశ్రమ పాఠశాలలకు అక్కడి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సన్నబియ్యం కేటాయిస్తారు.

# తిరుచానూరులో వరలక్ష్మీ వ్రతం



**వచ్చే శుక్రవారం కోసం భారీగా ఏర్పాట్లు**

**తిరుపతి,ఆగస్ట్ 11(ఆర్ఎన్ఎ):**

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీవ్రతం నిర్వహణకు టీటీడీ ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 16 న శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరపనుంది. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది. వరలక్ష్మి వ్రతం రోజు తెల్లవారుజామున మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించనున్న అర్చకులు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయంలోని ఆస్థాన మండపంలో వరలక్ష్మి వ్రతం వైభవంగా జరపనున్నారు. ఈమేరకు వ్రతం నిర్వహణ కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనే గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక వడ టిటిడి అందజేయనుంది. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఆర్జితసేవలైన అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, కుంకుమార్చన, వేదాశీర్వచనం, బ్రేక్ దర్శనం, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. మహామంగళ దేవత గా లక్ష్మీ అవతారమై వెలసిన అలమేలు మంగమ్మ తిరుచానూరు ఆలయంలో జగత్కల్యాణం కోసం అవతరించిందని భావించే భక్తులు వరలక్ష్మీ వ్రతంలో పాల్గొంటే విశేష ఫలాలు చేకూరుతాయని నమ్మకం. వ్రతం చేసే రోజున ఉదయాన్నే మంగళ స్నానం చేసి, నూతన వస్త్రాలు ధరించి ఆలయంలో అర్చకులు ఏర్పాటుచేసిన మండపంలో కొలువైన వరలక్ష్మీ దేవిని దర్శిస్తారు. వరలక్ష్మి వ్రతం రోజు అమ్మవారికి ఆభరణాలను అలంకరిస్తారు. లక్ష్మీమాతను పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం అర్చకులు ఆవాహనం చేసి షోడశోపచార పూజలు చేస్తారు. రక్ష కట్టిన తరువాత పసుపు, కుంకుమ, పూలతో వ్రతాన్ని సుసంపన్నం గావించి, వ్రతమహత్యం కథను అర్చకులు పటిస్తారు.

# బిజెపి హర్‌ఘర్ తిరంగా యాత్ర

**రాజ్‌కోట్‌లో ప్రారంభించిన జెపి నడ్డా**

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 11(ఆర్ఎన్ఎ):**

బిజెపి హర్‌ఘర్ తిరంగా యాత్ర ప్రారంభం అయ్యింది. గుజరాత్ రాజ్‌కోట్‌లో జెపి నడ్డా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరంగా యాత్రకు శ్రీకారం చుట్టారు.భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు మరికొద్ది రోజుల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 'హర్ ఘర్ తిరంగా' పేరిట బీజేపీ ప్రచార కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమాన్ని జాతీయ పండగగా నిర్వహించాలని జులైలో మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొని జాతీయ పతాకంతో సెల్ఫీ దిగి.. ఆ చిత్రాన్ని హర్‌తిరంగా.కామ్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు ప్రధాని మోదీ సూచించిన విషయం విదితమే. ఆగస్ట్ 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దేశంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ తిరంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనుంది. అలాగే ఆగస్ట్ 12, 13, 14 తేదీల్లో స్వాతంత్య్ర సమరయోధులకు నివాళు లర్పించనుంది. అదే విధంగా ఈ మూడు రోజులు యుద్ధ స్మారకాలను సందర్శించిన స్వాతంత్య్ర సమరంలో అమరులైన వారికి నివాళులర్పించనుంది. ఇక ఆగస్ట్ 14వ తేదీ దేశ విభజన జరిగిన నేపథ్యంలో మౌన ప్రదర్శన చేపట్టనుంది. ఆగస్ట్ 13 నుంచి 15వ తేదీ వరకు నివాసాలపై, వ్యాపార కేంద్రాలపై త్రివర్ణ పతాకం ఎగరవేయాలని ప్రజలకు బీజేపీ సూచించింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని ఆ పార్టీ సీనియర్ నేత తరుణ్ చుగ్ పిలుపు నిచ్చారు. దేశవ్యాప్తంగా ప్రతి బూత్‌లో త్రివర్ణ పతాకం ఎగురవేయాలన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేతలు, మోర్చ బృందాలు, జిల్లా పార్టీ అధ్యక్షులు అంతా పాల్గొనాలన్నారు. ఆగస్ట్ 11 నుంచి ఆగస్ట్ 15వ తేదీ వరకు జరుగుతున్న ఈ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని పార్టీ శ్రేణులకు తరుణ్ చుగ్ ఆదేశించారు. 2022 నుంచి దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా ప్రచారా కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుగుతుందని ఈ సందర్భంగా తరుణ్ చుగ్ గుర్తు చేశారు.

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్
People's Motivation

సోమవారం । ఆగస్టు । 12 । 2024

జనరల్ న్యూస్



# ప్రజలకు అండగా నిలిచేవి పత్రికలే




**ఒక వార్తతో "సంచలనాలు " రేపిన చరిత్ర ఉన్న పత్రికారంగం**

**ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభం పత్రికలు**

పత్రికలు కేవలం సమాచార సాధనాలు మాత్రమే కాదు. ఒకనాటి విజ్ఞాన వీచికలు... ఉద్యమ వాహకాలు.. చైతన్య దీపికలు.. ప్రజలకు అండగా నిలిచే ఆయుధాలు.. ఇలా ఒకటేమిటి అన్నింటికీ పత్రికలే. ఆధారంగా సమాజంలో పనిచేస్తాయి పత్రికల ఆధారంగానే స్వతంత్ర్య సమరం సాగింది. లక్షలు, కోట్ల కొలదీ ప్రజలను నడిపించింది. బ్రిటీష్ వారిని తరిమికొట్టి భారతదేశ ఔన్నత్యాన్ని నిలిపేందుకు దోహదపడింది. గాంధీ నుంచి అంబేద్కర్ వరకూ అందరూ పత్రికల్లో పనిచేశారు. పత్రికా స్వతంత్ర్యకోసం నిలిచారు. స్వతంత్ర్యానంతరం కూడా రెండు మూడు దశాబ్దాల పాటు పత్రికలు తమ విశిష్టతను నిలపుకున్నాయి. ప్రజా సమూహంలో విస్తృత ప్రభావాన్ని చూపగలిగాయి. కానీ గడిచిన మూడు దశాబ్దాలుగా పత్రికారంగం ప్రభావం కోల్పోతుందన్నది కాదనలేని సత్యం. అందులోనూ గత దశాబ్దకాలంగా సోషల్ మీడియా తాకిడితో తీవ్రంగా తల్లడిల్లిపోతోంది. డిజిటల్ మీడియా యుగంలో దారి తెన్నూ తెలియని దశకు చేరుకుంది. అందుకు తోడుగా కరోనా కారణంగా ఏర్పడిన సమస్యలు కుదేలయ్యేలా చేస్తున్నాయి. ఇప్పటికే పత్రికారంగంలో యాజమాన్యాలు కొన్ని గ్రూపుల చేతుల్లోనే ఉన్నప్పటికీ వాటి నిర్వహణ విషయంలో నానా అవస్థలు పడుతున్నారు. వార, మాస పత్రికలన్నీ దాదాపుగా మూతపడ్డాయి. దినపత్రికల సర్క్యులేషన్ కూడా పడిపోతోంది. అదేసమయంలో వ్యాపార ప్రకటనల రూపంలో వచ్చే ఆదాయం కూడా కుచించుకుపోతోంది. దాంతో టైమ్స్, ది హిందూ, ఇంకా అనేక తెలుగు పత్రికలు నిర్వహణను డిజిటల్ రంగానికి ప్రాధాన్యతనిస్తూ అటు వైపు మళ్లిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పత్రికలకు నేరుగా ప్రింట్ ద్వారా వచ్చే ఆదాయంతో పోలిస్తే డిజిటల్ ఆదాయం పెరుగుతుండడంతో పరిణామాలు దానికి తగ్గట్టుగా ఉన్నాయి. ప్రభుత్వాలు కూడా వాటికి ప్రాధాన్యతనిచ్చేందుకు సిద్ధపడడం లేదని చెప్పవచ్చు. పత్రికల కన్నా డిజిటల్ మీడియా ద్వారా ఎక్కువ మందిని చేరేందుకు అవకాశం ఉండడంతో అటువైపు దృష్టి సారిస్తున్నారు. దాంతో పత్రికలు పూర్తిగా కనుమరుగయ్యే దశ వస్తుందనే అంచనాలు అతిగా ఉండవచ్చు గానీ ప్రస్తుతానికి ప్రాధాన్యత రీత్యా వాటికి విలువ తగ్గుతోంది. ఒకనాడు రాజ్యమేలిన చోట ఇప్పుడు పత్రికలు బిక్కుబిక్కుమంటూ సాగుతున్నాయి. పాలకులను, పాలనను శాసించి, ఒక్క వార్తతో సంచలనాలు రేపిన చరిత్ర ఉన్న పత్రికా రంగం ఈనాడు ఈ స్థితికి చేరడానికి అనేక కారణాలున్నాయి. కొన్ని వ్యవస్థాపరమైనవి అయితే కొన్ని వృత్తిపరమైన సమస్యలు కూడా ఉన్నాయి. మొత్తంగా పత్రికారంగం పూర్వ వైభవం సాధించకపోయినా, ఉన్న స్థానాన్ని నిలబెట్టుకోవడం కూడా నిజమైన పరీక్షగానే భావించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికలకు ఊపిరి పోయాలని ఆనాడు ఈ పత్రికల ద్వారా జన చైతన్యం ఏర్పడిందని ఎందరో మహానుభావులు ఈ రంగం నుండి వచ్చి ఉన్నత శిఖరాలను అందుకున్నారని అటువంటి పత్రికలను మరువకూడదని తెలుసుకోవాలి అదేవిధంగా ఈనాడు కొన్ని వందల మంది పత్రిక రంగంలో పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వారిని చిన్నచూపే చూస్తుంది. ప్రజలు కు ప్రభుత్వాలు పథకాలు అందిస్తున్నప్పటికీ వాటిని ప్రజల్లోకి చేరదీసే వారు పత్రికలే!!! ఎన్ని ప్రభుత్వాలు మారినా జర్నలిస్టులకు ఏనాడు న్యాయం జరగలేదు!! ఎవరో వస్తారు ఏదో చేస్తారు అన్నట్లుగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వ రంగాలు జర్నలిస్టులకు సరైన న్యాయం చేయాలని కోరుతున్నారు.

కె. గోవింద్ రావు
పిఠాపురం ఇంచార్జ్
పీపుల్స్ మోటివేషన్

## రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి

**రోడ్డు పనులు త్వరగాపూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్న ఎమ్మెల్యే**



**పెబ్బేరు, ఆగస్టు 11 (పీపుల్స్ మోటివేషన్):-**

పెబ్బేరు పర్యటనలో భాగంగా ఆదివారం రోజు వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు నిర్మాణం, పనులను అంబేద్కర్ కాలనీ దగ్గర,ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, పనులను పరిలించారు, అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో పెబ్బేరు పట్టణంలో కుడా రోడ్డు పనులను పూర్తి చేసి గ్రామల ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, జిల్లా యువజన నాయకులు గంధం రంజిత్ కుమార్, మాజీ సర్పంచ్ లు వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, మాజీ డైరెక్టర్ రాములు, టౌన్ ఉపధ్యక్షులు రజక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## అల్లం టీ వల్ల ఇన్ని ఉపయోగాలా.!

చాలా మందికి ఉదయాన్నే వేడివేడిటీ గొంతులో పడితే కానీ మనసు ఊరుకోదు.. ఉత్సాహంగా కూడా పనిచేస్తారు కూడా.. దీనిలో పుష్కలంగా ఉండే విటమిన్ సి, మెగ్నీషియం, మినరల్స్ శరీరానికిఎంతో మేలు చేస్తాయి. ప్రయాణాలలో కడప తిప్పే వారికి వాంతులు అయ్యే వారికి ఈ అల్లం టీ చాలా బాగా ఉపశమనం కలిగిస్తుంది. కడుపుబ్బరం గ్యాస్ సమస్యలతో ఇబ్బంది పడేవారు కి కూడా ఈ అల్లం టీ చాలా మంచిది. ముఖ్యంగా మహిళలు పీరియడ్స్ సమయంలో ఎదుర్కొనే సమస్యలకు అల్లం టీ దివ్య ఔషధముల పనిచేస్తుంది. అప్పుడు వచ్చిన నొప్పిదూరం అవుతుంది.. దీనిని రోజు తాగితే మరీ మంచిది. 40,ఏళ్లు దాటిన వ్యక్తులకు నడుము నొప్పి కీళ్ల నొప్పులు వస్తుంటాయి. అలాంటి వారు కూడా అల్లం టీ తాగవచ్చు. జలుబు, జ్వరం ఉన్నవారు అల్లం టీ తాగాలి. మెరుగైన రక్తప్ర ప్రసరణకు అల్లం టీ బాగా పనిచేస్తుంది. శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. శరీరం ఒత్తిడికి గురి అయినప్పుడు మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. చెడు కొలెస్ట్రాల్ ను దూరం చేసి గుండె సంబంధిత సమస్యలు రాకుండా నివారిస్తుంది. సీజనల్ వ్యాధులకు అల్లం టీ తో చెక్ పెట్టవచ్చు. జలుబు, ఒళ్ళ నొప్పులు, జ్వరం వంటి సమస్యలకు అల్లం టీ అద్భుతంగా పనిచేస్తుంది. అధిక బరువును తగ్గించే శక్తి కూడా అల్లం టీ కి ఉంది. దూరం చేసి గుండె సంబంధిత సమస్యలు రాకుండా నివారిస్తుంది. మానసిక ప్రశాంతత కోసం అల్లం టీ ని తీసుకుంటే ఉపయోగముంటుంది%ొా% దీంతో కూరలకు చక్కని రుచి వస్తుంది. అయితే రుచికే కాదు.. ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందించడంలోనూ అల్లం ఎంతగానో ఉపయోగపడుతుంది. అల్లం లేకుండా మనం తయారు చేసే కూరలు తక్కువ ఉంటాయి. ఓన్లీ కర్రీస్ లో వేసుకోవడమే కాకుండా మనం అల్లం కషాయం తీసుకోవడం అట్లాగే పౌడర్ ఎక్కడైనా యూస్ చేయడం టీలోఅల్లం యూస్ చేయడం ఇలా రకరకాల ఫామ్స్ లో మనం అల్లం యూస్ చేసుకుంటూ ఉంటాము.

# సెక్యులర్ ఒత్తిడి చేయగలరా?

మోడీకి, ఆయన ప్రభుత్వానికి, వారి పార్టీ అయిన బిజెపికి, మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్‌కు హిందూ మతతత్వ ముద్ర ఉండడం తెలిసిందే. అందుకు భిన్నంగా చంద్రబాబు, నితీశ్‌ల పట్ల సెక్యులర్ వాదులనే పేరున్నది. అదెంత నిఖార్సయిన మాటన్నది తర్వాత చూద్దాము. కాని ఆ పేరైతే ఉన్నది. కనుక వారు మోడీపై సెక్యులర్ వత్తిడి చేయాలన్నది దేశంలో పలువురి ఆశాభావం. ఎందుకంటే, ఆ రెండు రాష్ట్రాలకు అవసరమయ్యే నిధులు, ప్రాజెక్టులు అభివృద్ధికి సంబంధించినవి. అక్కడికి పరిమితమైన విషయాలు. అందుకు భిన్నంగా సెక్యులరిజమన్నది మొత్తం దేశానికి సంబంధించినది. ఎందుకో వివరించనక్కర లేదు. అటువంటప్పుడు చంద్రబాబు, నితీశ్‌లు తమకు తమ రాష్ట్రాల పట్లనే గాక మొత్తం దేశం పట్ల కూడా బాధ్యత ఉందని భావించిన పక్షంలో, మోడీ ప్రభుత్వం పై సెక్యులర్ వత్తిడి తేవలసి ఉంటుంది. ఎన్‌డిఎలో భాగస్వాములుగా ఉన్న టిడిపి ప్రభుత్వాధినేత చంద్రబాబు నాయుడు, జనతాదళ్ (యునైటెడ్) ప్రభుత్వ నాయకుడు నితీశ్ కుమార్, తమ ఏలుబడిలోని ఆంధ్రప్రదేశ్, బీహార్‌లకు అవసరమైన వాటిని, ప్రధాని మోడీ ప్రభుత్వం నుంచి సాధించుకోవడం మంచిదే. తమ మద్దతు లేనిదే ఎన్‌డిఎ ప్రభుత్వం కొనసాగే అవకాశం దాదాపు లేనందున, మద్దతుకు బదులుగా కొన్ని అడిగి తీసుకోవడం సాధారణంగా జరిగేదే. ఆ ప్రకారం 202425 బడ్జెలో ఇరువురికి అదనపు నిధులు, కొన్ని ప్రాజెక్టులు లభించాయి.ఆ క్రమంలో మోడీ ప్రభుత్వం ఇతర దక్షిణాది రాష్ట్రాలను, ఎన్‌డిఎలో లేని రాష్ట్రాలను చిన్నచూపు చూసిందనే విమర్శలు వచ్చాయి. ఈ విషయమై ఇప్పటికే చాలా చర్చలు జరిగినందున దానిని పక్కన ఉంచుదాము. అయితే, ఈ రెండు పార్టీలు మోడీ ప్రభుత్వం, బిజెపి పార్టీ సెక్యులర్‌గా వ్యవహరించడం అవసరమనే ఒత్తిడి కూడా చేయగలరా, చేస్తున్నాయా అన్నది ఒక ముఖ్యమైన ప్రశ్నగా మారుతున్నది. మోడీకి, ఆయన ప్రభుత్వానికి, వారి పార్టీ అయిన బిజెపికి, మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్‌కు హిందూ మతతత్వ ముద్ర ఉండడం తెలిసిందే. అందుకు భిన్నంగా చంద్రబాబు, నితీశ్‌ల పట్ల సెక్యులర్ వాదులనే పేరున్నది. అదెంత నిఖార్సయిన మాటన్నది తర్వాత చూద్దాము. కాని ఆ పేరైతే ఉన్నది. కనుక వారు మోడీపై సెక్యులర్ ఒత్తిడి చేయాలన్నది దేశంలో పలువురి ఆశాభావం. ఎందుకంటే, ఆ రెండు రాష్ట్రాలకు అవసరమయ్యే నిధులు, ప్రాజెక్టులు అభివృద్ధికి సంబంధించినవి. అక్కడికి పరిమితమైన విషయాలు. అందుకు భిన్నంగా సెక్యులరిజమన్నది మొత్తం దేశానికి సంబంధించినది. ఎందుకో వివరించనక్కర లేదు. అటువంటప్పుడు చంద్రబాబు, నితీశ్‌లు తమకు తమ రాష్ట్రాలపట్లనే గాక మొత్తం దేశం పట్ల కూడా బాధ్యత ఉందని భావించిన పక్షంలో, మోడీ ప్రభుత్వంపై సెక్యులర్ ఒత్తిడి తేవలసి ఉంటుంది. ఈ విషయం ఇప్పుడు ప్రత్యేకంగా చర్చించడానికి కారణాలున్నాయి. మోడీ గత జూన్ ఆరంభంలో మూడవసారి అధికారానికి అయితే వచ్చారు గాని, మెజారిటీల పరిస్థితి ఏమిటో తెలిసిందే. సూటిగా మాట్లాడాలంటే, పరిపాలనా వైఫల్యాలతో పాటు మతతత్వ ధోరణులు కారణమయ్యాయన్నది అందరికీ అర్థమైన విషయం. అటువంటి స్థితిలో చేయవలసిందేమిటి? ఈ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని పద్ధతులు మార్చుకోవాలి. ఆ విధంగా చేసినట్లయితే ప్రజలు తప్పక తిరిగి ఆదరిస్తారు. ఎక్కడైనా ప్రజలకు ఆ గుణం ఉంటుంది. కాని జూన్ నుంచి జరుగుతున్నదేమిటి? పరిపాలనను మదింపు చేయడానికి ఈ రెండు నెలలు చాలవు. మతతత్వ ధోరణులు మాత్రం ఎంత మాత్రం మారలేదు. ప్రతి రెండు రోజులకు ఒకసారి కేంద్ర స్థాయి నుంచో, దేశంలో ఏదో ఒక చోటి నుంచో ఈ పోకడలు గల వార్తలు వస్తూనే ఉన్నాయి. అవి అల్పసంఖ్యాక వర్గాలకు వ్యతిరేకమైన చర్య లు ఒక్కటే కాదు. దళితులు, ఇతర బడుగు బలహీన వర్గాలకు సంబంధించినవి కూడా. సాక్షాత్తూ బిజెపి ప్రభుత్వాల వైపు నుంచి జరిగేవి కొన్నయితే, ఆ పార్టీతో పాటు వివిధ సంఘ్ పరివార్ సంస్థల అనుయాయుల నుంచి జరిగేవి కొన్ని. వీరందరి అండ చూసుకుని పెత్తందారీ వర్గాల నుంచి చోటు చేసుకునేవి మరి కొన్ని. అధికారంలో ఉన్నందున పోలీసులు, ఇతర అధికార యంత్రాంగాల విధేయత కూడా వారికే. ఈ తరహా ఘటనల జాబితా అంతా మన దగ్గర లేదు గాని, అన్ని పత్రికలు చూడలేము గనుక అది సాధ్యం కూడా కాదు గాని, దృష్టికి వస్తున్నవైనా తక్కువ కాదు. అనగా, పాఠాలు నేర్వడం గాని పద్ధతులు మార్చుకోవడం గాని ఏమీ లేదన్న మాట. ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ విమర్శల తర్వాతనైనా మోడీ, బిజెపిల తీరు మారగలదని కొందరు ఆశించారు. గత ఎన్నికల ఫలితాలు వెలువడిన వారం రోజులకు ఆయన జూన్ 10వ తేదీన నాగపూర్‌లో బహిరంగ విమర్శలు చేయడం తెలిసిందే. ఆ వివరాలన్నీ ఇక్కడ చెప్పుకోకున్నా క్లుప్తంగా మాట్లాడుకోవాలంటే, అందు లో ప్రధానంగా మూడు అంశాలున్నాయి. ఒకటి, మనది వైవిధ్య సమాజం. అయినా అది భిన్నత్వంలో ఏకత్వం. దాన్ని ఆమోదించాలి. ఇతరుల మార్గాలను గౌరవించాలి. అదే ధర్మం. ఆ మాట కూర్మ పురాణంలోనూ ఉంది. కాని మనం దాన్ని విస్మరించాము. దేశంలో వేర్వేరు మతాలవారున్నారు. చరిత్ర క్రమంలో బయటి నుంచి కొందరు వచ్చారు. అదంతా ఎన్నడో జరిగింది. ఇప్పుడు అన్ని మతాలు సమానం. అన్నింటిని గౌరవించాలి. గతాన్ని వదలివేయాలి. అందరి పట్ల సద్భావన చూపాలి. విభేదాలు పూర్తిగా తొలగిపోవాలి. భవిష్యత్తు గురించి ఆలోచించాలి. ఈ దేశ సంతానమంతా మన సోదరులే. వారితో కలసిమెలసి ఉండాలి. రెండవది, కుల వ్యవస్థ ఎప్పుడో ఎందుకో వచ్చింది. కాని అది తప్పు. మూడవది, వస్తుపరమైన అభివృద్ధి ఉండవచ్చు. కాని విలువలు పోతున్నాయి. సంస్కృతి పోతున్నది. ప్రభుత్వాలు అది కూడా పట్టించుకోవాలి. నీతితోకూడిన సంపదలు అభివృద్ధి చెందాలి. ఈ మూడు మాటలు కూడా మోడీ ప్రభుత్వానికి, బిజెపికి ఎంత సూటిగా వర్తిస్తాయో వివరించి చెప్పనక్కర లేదు. భాగవత్ ప్రసంగం పట్ల బిజెపిలో ఏమైనా చర్చలు జరిగాయో లేదో తెలియదు గాని ఆ మేరకు వార్తలేవీ కన్పించలేదు. సర్ సంఘ్ చాలక్ బహిరంగంగా ఇంత మాట్లాడిన తర్వాత, బిజెపి అన్నది సంఘ్ పరివార్‌లో భాగం అయినందున ఆ పరివార్‌కు మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ చొరవ తీసుకుని బిజెపి అధ్యక్షుడిని, ప్రధాన మంత్రిని రప్పించి విషయాలు చర్చించిందో లేదో కూడా తెలియదు. ఒకవేళ ఇటువంటి వేమీ జరగనట్లయితే అది కూడా ఆశ్చర్యమే. అయితే ఇదే కాలంలో గమనించినవలసిందొకటి జరిగింది. బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా ఒక సందర్భంలో మాట్లాడుతూ, తాము స్వతంత్రులమని, మద్దతు కోసం ఆర్ఎస్ఎస్‌పై ఆధారపడి లేమని అన్నారు. ఈ చర్చలోకి వెళ్లేందుకు ఇది సందర్భం కాదు.ఇక్కడ గుర్తించవలసిన ఒకే ఒక విషయమేమంటే, ఎన్నికలలో ఎదురు దెబ్బలు, భాగవత్ హెచ్చరికల తర్వాత సైతం మోడీ ప్రభుత్వపు తీరు, బిజెపి ధోరణి అణు మాత్రం అయినా మారలేదు. ఈ పరిస్థితిలో చంద్రబాబు, నితీశ్‌లకు సంబంధం ఉండాలన్నది ఇక్కడ చర్చించవలసిన అసలు విషయం. వీరిద్దరు మతతత్వ బిజెపితో కాకుండా సెక్యులర్ ఇండియా కూటమిలో కలవాలనే ప్రయత్నాలు ఆ కూటమి వైపు నుంచి జరగటం తెలిసిందే. కాని ఉభయులూ తమ రాష్ట్రాల ప్రయోజనాల కోసమని ఎన్‌డిఎలో చేరారు. నిజం చెప్పాలంటే ఇండియా కూటమికి ఎన్‌డిఎతో పోల్చగల సుస్థిరత లేదు కూడా. పైగా నితీశ్ ఎన్నికల ముందు నుంచే ఎన్‌డిఎలో ఉన్నారు. ఇండియాలో ఒకవేళ చేరినా బీహార్‌లోని ఇతర పార్టీలతో ఆయనకు సరిపడేది కాదు. మరొక వైపు తనకు బిజెపి మతతత్వం పట్ల ప్రత్యేకమైన వ్యతిరేకత చాలా కాలంగా లేదు. చంద్రబాబు విషయం కూడా అంతే. ఎన్‌డిఎలో చేరినందున తన రాష్ట్రంలో సమస్య లేదు. వీటన్నింటికి మించి ఇరువురికీ మోడీ ప్రభుత్వం ద్వారా సమకూరగల ప్రయోజనాలు అనేకం ఉంటాయి. ఈ కోణాల నుంచి వారి కూటమి సర్ది చెప్పుకోగలదే. కాని విషయం అది కాదు. స్వయంగా భాగవత్ పేర్కొన్న అంశాలను, దేశ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు, ఇప్పటికీ అదుపు లేకుండా కొనసాగుతున్న మతతత్వ ధోరణులను, చర్యలను నిర్మూలించడం వారి చేతిలో లేకపోయినా అదుపు అయేట్లు చేయడం సాధ్యమే. అందుకోసం వారు చేయవలసింది అటువంటివి తగదని మోడీపై గట్టి వత్తిడి తీసుకు రావడం.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

## మహేష్‌కి హీరోయిన్ రిక్వెస్ట్..!



సూపర్ స్టార్ మహేష్ బర్త్ డే రోజు స్టార్స్ అంతా కూడా మహేష్ మీద ఉన్న అభిమానాన్ని బయట పెడుతూ సోషల్ మీడియాలో విసెష్ అందిస్తున్నారు. ఐతే ఒక హీరోయిన్ మాత్రం స్పెషల్ విష్ చేస్తూ ఫ్యాన్స్ ని ఆకట్టుకుంది.మన మహేష్ సార్ అంటూ మొదలు పెట్టి నన్ను గుర్తుంచుకోండి అంటూ ఆమె కామెంట్ చేసింది. ఇంతకీ ఎవరా హీరోయిన్ ఎందుకు అలా పెట్టింది చూస్తే. మహేష్ తో నటించిన ప్రతి హీరోయిన్ ఆయన సెన్సాఫ్ హ్యూమర్, ఆయన తో నటించడం బాగుంటుంది. ఇదే క్రమంలో మహేష్ తో నటించిన కీర్తి సురేష్ కూడా మహేష్ తో సర్కారు వారి పాట సినిమాలో జత కట్టింది.ఆ సినిమాలో కళావతి పాత్రలో అమ్మడు తన గ్లామర్ తో కూడా మెప్పించే ప్రయత్నం చేసింది. నేడు మహేష్ పుట్టినరోజు అవ్వడం వల్ల మన మహేస్ గారికి విషెష్ చెబుతూ నేను పనిచేసిన వరిలో అమేజింగ్ పర్సనాలిటీ అంటూ మీ నుంచి రాబోయే అన్ని సినిమాలు బాగుండాలని ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. అంతేకాదు ఈ స్పెషల్ రోజు మీకు ఎన్నో ప్రేమ పూర్వక శుభాకాంక్షలు అని పెట్టింది. ఫైనల్ గా మీ కలవతిని అప్పుడప్పుడు గుర్తు పెట్టుకోండి అంటూ చివర్లో మహి అని పెట్టేసింది. మహేష్ తో నటించిన సర్కారు వారి పాట సినిమా పాత్ర తరహాలోనే సూపర్ స్టార్ కి చిలిపి మెసేజ్ చేసింది కీర్తి సురేష్. మహేష్ తో ఆమె నటించిన సర్కారు వారి పాట కమర్షియల్ లెక్కలు ఎలా ఉన్నా ఆ ఇద్దరి జోడీ మాత్రం అలరించింది. మహేష్ తో మళ్లోసారి నటించాలనే రిక్వెస్ట్ తోనే కీర్తి సురేష్ అలా గుర్తు పెట్టుకోండి అనే మెసేజ్ పెట్టిందని ఫ్యాన్స్ అంటున్నారు. ప్రస్తుతం మహేష్ రాజమౌళి డైరెక్షన్ లో సినిమా ప్లానింగ్ లో ఉంది. నేడు ఈ సినిమా అనౌన్స్ మెంట్ వస్తుందని అనుకోగా ఫ్యాన్స్ డిజప్పాయింట్ అవుతున్నారు.

## గురూజీ సోనాలి వైపు చూడొచ్చుగా..!




అదేంటో స్టార్ సినిమాల రీ రిలీజ్ లు కేవలం ఫ్యాన్స్ కు ఏదో సరదాగా ఎంటర్టైన్ కోసమే అనేసుకుంటే పొరబడినట్టే. లేటెస్ట్ గా మురారిసినిమా వల్ల ఆ సినిమా డైరెక్టర్ కృష్ణవంశీ మళ్లీ జోష్ నింపుకున్నారు.తను డైరెక్ట్ చేసిన 20 ఏళ్ల క్రితం సినిమా రీ రిలీజ్ కు ఫ్యాన్స్ చేస్తున్న హంగామా చూసి ఆయన ఖుషి అవుతున్నారు. సినిమా రిలీజ్ కు వారం ముందు వరకు కృష్ణవంశీ ప్రతి మహేష్ అభిమానికి.. తన అభిమానికి ఓపికగా సోషల్ మీడియాలో ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. మురారి రీ రిలీజ్ కు ఈ మాత్రం క్రేజ్ రావడానికి వారం ముందు దాకా కృష్ణవంశీ ఇచ్చిన బూస్టప్ బాగా పనిచేసింది. ఇక సినిమా రీ రిలీజ్ టైం లో ఆ సినిమాలో నటించిన యాక్టర్స్ తో స్పెషల్ బైట్ కూడా ఫ్యాన్స్ ని ఎగ్జైట్ చేసింది. సోనాలి, రవి బాబు, శివాజి రాజా, చిన్నా, అనితా చౌదరి ఇలా మురారితో సంబంధం ఉన్న వారంతా అందుబాటులో ఉన్న వారంతా బైట్ లు ఇచ్చారు. దాని వల్ల సినిమా కు మరింత క్రేజ్ ఏర్పడింది. ఐతే రిలీజ్ రోజు సోనాలి సోషల్ మీడియాలో కూడా ఆ సినిమా షూటింగ్ అంతా చాలా సరదాగా సాగిందని. మహేష్ తో కలిసి పని చేయడం మంచి ఎక్స్ పీరియన్స్ అని చెప్పింది. సోనాలి లైన్ లోకి వచ్చాక అమ్మడు మళ్లీ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తే బాగుంటుందని ఫ్యాన్స్ కోరుతున్నారు. వెంటనే త్రివిక్రం సోనాలిని కూడా తీసుకొచ్చెయ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఒకప్పటి హీరోయిన్స్ అందరినీ తన సినిమాల్లో పెడుతూ క్రేజ్ తెచ్చే గురూజీ సోనాలి ని కూడా ఏదైనా సినిమాలో రీ ఎంట్రీ ఇప్పిస్తే ఆమె తెలుగు ఫ్యాన్స్ కచ్చితంగా సంతోష పడతారని చెప్పొచ్చు.

# ఎన్టీఆర్ ఫ్యామిలీ నుంచి మరో జూనియర్

సీనియర్ నటుడు దివంగత నందమూరి తారక రామరావు ముద్దుల మనవడు జూనియర్ ఎన్టీఆర్ కాదని టాలీవుడ్ సీనియర్ దర్శకుడు వైవీఎస్ చౌదరి సంచలన వ్యాఖ్యలు చేశాడు. నందమూరి హరికృష్ణ మనవడు, జానకిరామ్ కుమారుడునందమూరి తారకరామారావు ను వైవీఎస్ చౌదరి టాలీవుడ్‌కి పరిచయం చేయబోతున్న విషయం తెలిసిందే. తెలుగమ్మాయి వీణరావు ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఆస్కార్ విజేతలు కీరవాణి సంగీతం, చంద్రబోస్ సాహిత్యాన్ని అందించబోతున్నారు. సీనియర్ ఎన్టీఆర్‌కి ముద్దుల మనవడు జూ. ఎన్టీఆర్ కదా అని అడుగగా..వైవీఎస్ మాట్లాడుతూ.. ఎవరు చెప్పారు సీనియర్ ఎన్టీఆర్‌కి ముద్దుల మనవడు జూ. ఎన్టీఆర్ అని.. అది అబద్ధం. తారక్ రామరావు గారికి ఇష్టమైన మనవడు జూ. ఎన్టీఆర్ అయితే మిగత మనవళ్లు ఇష్టం లేరని అంటున్నారా. అంటూ ఎదురు ప్రశ్నించారు. సీనియర్ ఎన్టీఆర్‌కి అతని కుటుంబంలో ఉన్న అందరు సమానమే. అంటూ వైవీఎస్ తెలిపాడు.



## స్టార్ అని పిలవొద్దు



"స్టార్ నాయికగా పేరు తెచ్చుకోవాలని ఉంది కానీ.. ఇప్పుడే నన్ను స్టార్ నటిగా సంబోధించడం నచ్చద"ని అంటోంది శ్రీలీల. తెలుగు చిత్రసీమలోకి వచ్చిన అనతి కాలంలోనే అగ్ర హీరోలందరితోనూ జోడీ కడుతూ ఆకర్షించిన ఈ తెలుగందం..ప్రస్తుతం ఇటు దక్షిణాదిలోనూ అటు ఉత్తరాదిలోనూ వరుస సినిమాలతో జోరు చూపిస్తోంది. అయితే ఇంత క్రేజ్ తెచ్చుకున్నా ఇప్పటికీ స్టార్ అని పిలిపించుకోవడానికి తనకింకా ఆ అర్హత రాలేదనే అంటోంది శ్రీలీల. "నా దృష్టిలో స్టార్ కిరీటం అన్నది ఒకటి రెండు చిత్రాల ప్రయాణంతో వచ్చేసేది కాదు. ఎన్నో వైవిధ్యభరితమైన పాత్రలతో అలరించాలి.ఏళ్ల పాటు ప్రేక్షకులతో కలిసి ప్రయాణం చేయాలి. అప్పుడే స్టార్ అని పిలిపించుకోవడానికి తగిన అర్హత పొందానని భావిస్తా. అందుకే నన్నెవరైనా స్టార్ నటి అని పిలిస్తే సున్నితంగా అలా పిలవొద్దని చెబుతుంటాన"ని వివరించింది శ్రీలీల. ప్రస్తుతం తన దృష్టంతా విభిన్నమైన కథలు, పాత్రలు చేయడంపై ఉందని.. ఇప్పుడప్పుడే ప్రత్యేక గీతాల వైపు చూసే ఆలోచన లేదని చెప్పుకొచ్చింది. ఆమె ప్రస్తుతం తెలుగులో 'రాబిన్‌హుడ్', 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పాటు రవితేజతో ఓ సినిమా చేస్తోంది. అలాగే హిందీలో రెండు ప్రాజెక్ట్‌లు చర్చల దశలో ఉన్నాయి.

## తెరపైకి కొత్త తెలుగందం



'దేవదాసు', 'సీతయ్య' లాంటి విజయవంతమైన సినిమాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు వై.వి.ఎస్ చౌదరి. కొన్నేళ్ల విరామం తర్వాత ఇప్పుడాయన స్వీయ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. నందమూరి జానకీరామ్ తనయుడు నందమూరి తారక రామారావు ఈ సినిమాతో హీరోగా పరిచయం కానున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ పతాకంపై యలమంచిలి గీత నిర్మిస్తున్నారు. ఇప్పుడీ సినిమా కోసం తెలుగమ్మాయి వీణ రావును కథానాయికగా ఎంపిక చేశారు. అలాగే సాయిమాధవ్ బుర్రా మాటల రచయితగా..ఎం.ఎం.కీరవాణి సంగీత దర్శకుడిగా.. చంద్రబోస్ పాటల రచయితగా వ్యవహరించనున్నారు. ఈ విషయాల్ని చిత్ర బృందం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు వైవిఎస్ చౌదరి మాట్లాడుతూ.."కంచె' సినిమా చూసినప్పుడే సాయిమాధవ్ బుర్రాతో పని చేయాలని అనుకున్నా. ఈ చిత్రంతో అది సాధ్యమైనందుకు ఆనందంగా ఉంది. ఈ కథ విని కీరవాణి చాలా సంతోషపడ్డారు. ఓ పెద్దన్నలా సలహాలు, సూచనలిచ్చారు. దానికి ఆయనకు కృతజ్ఞతలు. అలాగే ఈ సినిమాకి చంద్రబోస్ అందించే సాహిత్యం మహా అద్భుతంగా ఉండనుంది" అన్నారు. "ఈ కథ విన్నాను. చాలా బాగుంది. ఈ బ్యానర్ పేరుకు తగ్గట్లుగానే ప్రతిభ గర్జిస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. దీనికి నాకు మంచి సంభాషణలు రాసే అవకాశం దొరికింది" అన్నారు రచయిత సాయిమాధవ్ బుర్రా.

## తల్లి మనసు ప్రారంభం



తల్లి మనసు ప్రారంభంప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మాతగా తొలిసారి సినీ రంగం లోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కనున్న ఈ చిత్రం ద్వారా వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శుక్రవారం అన్నపూర్ణా స్టూడియోలో ఈ చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత పోకూరి బాబురావు క్లాప్ నివ్వగా, ఏషియన్ గ్రూప్ ఎం.డి.భరత్ నారంగ్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. హాస్య నటుడు బ్రహ్మానందం, దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు తదితరులు పూజా కార్యక్రమాలలో పాల్గొని, చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందజేశారు. చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ, 'నా దగ్గర ఎంతో మంది సహాయ, కో- డైరెక్టర్లుగా పనిచేశారు. వి.శ్రీనివాస్ (సిప్పీ)లో అద్భుతమైన టాలెంట్ చూసి, ఆయనకు అవకాశం కల్పించాం' అని అన్నారు. 'ఓ మధ్య తరగతి తల్లి చుట్టూ తిరిగే చక్కటి కుటుంబ కథా చిత్రమిది. ఆమె మనోవేదన, సంఘర్షణను ఇందులో ఆవిష్కరిస్తున్నాం' అని దర్శకుడు వి.శ్రీనివాస్ (సిప్పీ) చెప్పారు. నిర్మాత ముత్యాల అనంత కిషోర్ మాట్లాడుతూ,'నాన్న పేరు నిలబెట్టేలా ఈ సినిమా ఉంటుంది. ప్రారంభం రోజు నుంచి యాభై రోజుల పాటు నిర్విరామంగా జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పార్ట్ పూర్తి చేస్తాం. నవంబర్ లేదా డిసెంబర్‌లో ఈ సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com